కార్మికులకు వైద్య పరీక్షలు



మున్సిపల్ కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మణికొండ: ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేసి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికులు వారి ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ డీఈ నరేష్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చెత్తాచెదారం, మురుగులో పని చేసే కార్మికులకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి డాక్టర్ల సలహాలను తీసుకుని అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, వార్డు అధికారులు, జవాన్లు, కార్మికులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి



రోబోను పరిశీలిస్తున్న డీపీఎస్ విద్యార్థులు

మణికొండ: ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మార్కెట్‌లోకి వస్తున్న కొత్త టెక్నాలజీలు, వాటి తయారీ విధానంపై ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బీవీఎస్ రావు అన్నారు. ఖాజాగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 120 మంది విద్యార్థులు గండిపేటలోని సీబీఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించటంతో పాటు ఐడియా ల్యాబ్‌లో ఉన్న 3డీ ప్రింటర్లు, స్కానర్లు, రోబోలు, డ్రోన్‌లు, పీసీబీ యంత్రం, ఇండస్ట్రియల్ డ్రోన్, హ్యూమనాయిడ్ రోబోల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వనిత, డాక్టర్ సుజాత గుప్తా, డాక్టర్ ధర్మలింగం, పీఆర్‌ఓ జీఎస్‌ఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏమ నాలా..?

మురుగు కాలువలా మారిన ఫిరంగి నాలా

- ఔట్‌లెట్ లేకపోవడంతో బస్తీల మురుగు నీరు దీనిలోకే..
- దుర్వాసన భరించలేక అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

శంషాబాద్: మురుగునీటి సరఫరాకు సరైన ఔట్‌లెట్ లేని శంషాబాద్ మున్సిపాలిటీలో ఫిరంగి నాలా కాస్తా మురుగు కాలువలా మారింది. ఇటీవల పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు పెరిగిపోవడంతో ఈ నాలా కాస్తా పూర్తి స్థాయిలో భారీ మురుగునీటి కాలువలా మారింది. దీంతో సమీప కాలనీ ప్రజలకు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.



శంషాబాద్ పట్టణంలో ఫిరంగి నాలా

ఎందుకిలా..?

పట్టణంలోని మధురానగర్, ఆర్‌బీనగర్, మిషన్ కాంపౌండ్ మీదుగా ఫిరంగి నాలా సదరన్ వెంచర్ గుండా సాతంరాయిలోకి ప్రవేశిస్తుంది. పట్టణంలోని మధురానగర్ కాలనీ నుంచి ఆర్‌బీనగర్ మిషన్ కాంపౌండ్ వరకు ఉన్న నాలాకు అన్ని వైపు భారీ ఎత్తున వెలిసిన బస్తీలకు సంబంధించిన మురుగు నీటిని పూర్తిగా దీనిలోకే వదిలేస్తున్నారు. పంచాయతీ కాలం నాటి నుంచి మురుగునీటి సరఫరాకు ఎలాంటి ఔట్‌లెట్ లేకపోవడంతో అప్పటి నుంచి మురుగునీటిని ఫిరంగి నాలాలోనికే వదిలేస్తున్నారు.

వాణిజ్య సముదాయాల నుంచి..

పట్టణంలోని వాణిజ్య సముదాయాలతో పాటు హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లు కూడా విచ్చలవిడిగా పెరిగిపోవడంతో వాటి డ్రైనేజీ వ్యర్థాలతో పాటు జంతుకళేబరాలు, వ్యర్థాలు కూడా కొంత కాలంగా ఇందులోనే పారబోస్తున్నారు. దీంతో మిషన్ కాంపౌండ్, ఆర్‌ఆర్‌నగర్ కాలనీ వద్ద నిలిచిపోతున్న నీటితో ఏర్పడుతున్న దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌ఆర్‌నగర్ కాలనీవాసులు ఫిరంగి నాలా వద్ద చెత్త, జంతు కళేబరాలు వేయకూడదంటూ బ్యానర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇక మిషన్ కాంపౌండ్ వాసులు సీఎం పేషిలో తమ ఫిర్యాదును అందజేయడంతో పాటు వైద్యశాఖ మంత్రి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుల ద్వారా మొరపెట్టుకున్నారు. మున్సిపాలిటీకి సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతోనే ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం లేదనే వాదనలున్నాయి. అధికారులు సత్వర చర్యలు తీసుకుని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

రోగాల బారిన పడుతున్నాం



మిషన్ కాంపౌండ్ సమీపంలో నాలాలో పెద్ద ఎత్తున మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు, ఈగలు, కీటకాలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. కాలువ సమీపంలో పెద్ద ఎత్తున కోళ్లు, పశువుల వ్యర్థాలు పారబోస్తున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి.

-సామ్‌సన్, మిషన్ కాంపౌండ్

సమస్యను వెంటనే పరిష్కరించాలి



ఫిరంగి నాలాలో నిలిచిపోయిన మురుగునీటితో పక్కనే ఉన్న కాలనీ ప్రజలతో పాటు పాఠశాల విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల వ్యాప్తి, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరవుతున్నాం. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- అనిత, ఎంబీపీ హైస్కూల్ హెడ్‌మాస్టర్



ఫిరంగి నాలా వద్ద బ్యానర్ ఏర్పాటు ఆర్‌ఆర్‌నగర్ కాలనీవాసులు

రోడ్లు వేస్తున్నాం: డీఈ శివసాయి

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో అధ్వానంగా మారిన రోడ్లతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'సాక్షి'దినపత్రిక ప్రచురించిన 'రోడ్లు ఇలా..ప్రయాణం సాగేదెలా..?'అనే శీర్షికన ప్రచురించిన కథనం స్థానికంగా కలకలం రేపింది. దానిని అలకాపూర్ టౌన్‌షిప్, తుల్జారాం కాలనీ, ప్రశాంతిహిల్స్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్, గర్వా, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లో అనేక పోస్టులు పెట్టారు. ఎక్స్ వేదికగా పలు శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్, హెచ్‌ఎండీఏ, సీడీఎం,ఏ, ముఖ్యమంత్రిని ట్యాగ్ చేస్తూ పోస్టులు పెట్టారు. దీంతో స్పందించిన మణికొండ మున్సిపాలిటీ డీఈ శివసాయి 'సాక్షి'తో మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలోని ఇతర కాలనీలన్నింటిలో అవసరం ఉన్న చోట కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు ప్యాచ్ వర్క్‌లు చేస్తున్నామన్నారు. శుక్రవారం 'సాక్షి'పత్రికలో వచ్చిన కథనంలో ఉన్న రోడ్లు దేవాదాయ శాఖ భూమిలో ఉన్నాయన్నారు. వాటిల్లో మున్సిపాలిటీ నుంచి రోడ్లు వేయాలంటే సదరు శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గతంలో ఓ కాలనీవాసులు రోడ్లు వేసుకున్నా దానికి మున్సిపాలిటీ ఇంజినీరింగ్ అధికారులను బాధ్యులను చేసి ఫిర్యాదులు చేశారన్నారు. అంజలిగార్డన్ కాలనీలో రోడ్డును వేయాలని కోరిన వారే ఎన్నిసార్లు ప్రజాధనం పెట్టి రోడ్లు వేస్తారని విమర్శించారన్నారు. అందుకు ఇలాంటి విమర్శలకు తావులేని పనులే చేస్తున్నామని తెలిపారు.

వ్యాపార కేంద్రాలపై తనిఖీలు ముమ్మరం



ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని వ్యాపార కేంద్రాలపై అధికారులు, సిబ్బంది తనిఖీలను ముమ్మరం చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తిస్తూ అపరాధ రుసుం విధిస్తున్నారు. వారికి ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ ఐదు డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లు రోజురోజుకూ అభివృద్ధి చెందుతాయి. వేలాది మంది ఈ ప్రాంతాల్లో తమ వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారం నిర్వహిస్తున్నారు. కానీ జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందడం లేదు. గతంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 9 వేలకు పైగా ట్రేడ్ లైసెన్స్‌లు ఉండేవి. ప్రస్తుతం ఇవి 5 వేలకు చేరాయి. దీంతో అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లపై దృష్టి సారించారు. ప్రస్తుతం అధికారులు, సిబ్బంది అంతా తమకు కేటాయించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతూ ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తిస్తున్నారు. గత వారం రోజుల్లో అధికారులు దుకాణాలను సీజ్ చేయడంతో పాటు అపరాధ రుసుంలను విధించారు.

ముష్కి చెరువును అభివృద్ధి చేస్తాం



ముష్కి చెరువును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మణికొండ: ముష్కి చెరువును అన్ని ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ శాఖలకు సమన్వయంతో పనిచేసి నిబంధనల ప్రకారం అభివృద్ధి చేస్తామని మణికొండ మున్సిపల్ డీఈ శివసాయి, ఇరిగేషన్ ఏఈ నరేంద్ర అన్నారు. హెచ్‌ఎండీఏ అడిషనల్ కమిషనర్ కోట శ్రీవాత్సవ్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశాలతో శుక్రవారం వారు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేష్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, స్థానిక మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా నివాసితులతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ధృవాన్ష్ సంస్థ చెరువు అభివృద్ధి పేరుతో ఎఫ్‌టీఎల్ పరిధిని తగ్గించి రియల్ ఎస్టేట్ సంస్థలకు మేలు చేయడం, నివాసాల నుంచి వస్తున్న మురుగునీటిని చెరువులో కలపడం, చెరువులో నుంచి ఎక్కువైన నీరు బయటకు పోకుండా మట్టి కట్ట ఏర్పాటు చేయడం లాంటి పనులను చేపట్టారని ఫిర్యాదు చేశారు. ఈనెల 15న ఎమ్మెల్యేతో పాటు హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు చెరువును పరిశీలించి చెరువు అభివృద్ధికి ముందుకు వచ్చిన తత్వ రియల్ ఎస్టేట్ సంస్థకు మార్గదర్శకాలు ఇస్తారని, అనంతరం పనులను మొదలు పెడతామని అధికారులు, నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, నివాసితుల ప్రతినిధి గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

అత్తాపూర్: హైదర్‌గూడలోని పోచమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించి మహిళలు పూజలు చేసి హారతులు ఇచ్చారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడంతో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలకు మరమ్మతులు

శాస్త్రిపురం: ప్రజల సమస్యల పరిష్కారంలో ఎంఐఎం పార్టీ ముందు ఉంటుందని మాజీ జీహెచ్‌ఎంసీ వార్డు కమిటీ సభ్యుడు మహ్మద్ జహంగీర్ అన్నారు. సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలోని హసన్‌నగర్, మహ్మద్‌నగర్‌లలో కొద్ది రోజులుగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. శుక్రవారం ఆయన బస్తీల్లో పర్యటించి విద్యుత్ దీపాల సమస్యను తెలుసుకొని జీహెచ్‌ఎంసీ సిబ్బందితో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. బస్తీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పాలని, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.



వేముల వెంకటేశ్‌కు ఘన నివాళి



రాజేంద్రనగర్: జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ సంతాప సభను రాజేంద్రనగర్ సర్కిల్‌లోని వడ్డెర సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 33 జిల్లాలకు చెందిన వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పలు తీర్మానాలను నాయకులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, పీట్ల శ్రీధర్, వేముల రామకృష్ణ, మొగిలి, వల్లెపు శివ, పిట్ల గోపాల్, లక్ష్మీకాంతయ్య, లోకనాథం, మారయ్య, వల్లెపు గణేష్, పల్లెకు రమేశ్, భవానీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఈనెల 13, 20వ తేదీల్లో జరగనున్న బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అక్కెం రఘుయాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, ఎడ్లకాడి సూర్యం, మైసిరెడ్డి, కొంపల్లి జగదీష్ ప్రవీణ్, జి.రాజు, భూదేవి, కుమార్, సునీల్, సురేష్ ముదిరాజ్, దుర్గా ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.



స్టేడియాన్ని అందుబాటులోకి తెస్తాం

మణికొండ: ల్యాంకోహిల్స్ పక్కన స్టేడియంలో అన్ని రకాలతో సౌకర్యాలను కల్పించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్టేడియంలో కొనసాగుతున్న నెట్ ఏర్పాటు, మిగిలిపోయిన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించామని, ఆయన పనులు కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శివసాయి, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నవజ్యోతి యూత్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనాలను ఘనంగా నిర్వహిద్దాం

మణికొండ: ఈనెల 20న బోనాలను ఘనంగా నిర్వహిద్దామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని నార్సింగి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక అన్నారు. శుక్రవారం నార్సింగిలోని పోచమ్మ ఆలయానికి రంగులు వేసే పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అరుణోదయ సొసైటీలో నిర్మాణంలో ఉన్న దుర్గామాత ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, వినోద్‌కుమార్, శ్రీకాంత్, కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన


మణికొండ: ప్రతి ఇంటి నుంచి బయటకు వస్తున్న చెత్తతో పర్యావరణానికి ఎంత మేలు, కీడు జరుగుతుందో తెలుసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. శుక్రవారం ఆమె ఆధ్వర్యంలో 17వ వార్డులో మహిళా సంఘాలకు తడి, పొడి, హానికర చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నార్సింగి మున్సిపాలిటీలో తడి చెత్తతో వర్మికాంపోస్టు ఎరువులు తయారు చేయడం, పొడి చెత్తతో బ్రిక్‌లు తయారు చేస్తున్నారన్నారు. హానికర చెత్తను నిర్మూలిస్తున్నారని, వాటిని మూడుగా వేరు చేసిన తర్వాత చెత్త రిక్షాల వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నార్సింగిలో అవగాహన కల్పిస్తున్న మాజీ కౌన్సిలర్ ఉషారాణి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌లో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, బిఆల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనుల్లో భాగంగా శాంతినగర్ అయ్యప్ప స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను, అదే విధంగా మధుబన్‌కాలనీ మధురానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వాంబే కాలనీలో పర్యటిస్తూ భూగర్భ డ్రైనేజీ పైపులైన్ దెబ్బతినడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి మేనేజర్ ప్రసాద్, రాంకీ రాకేష్, జవాన్ శేఖర్, డివిజన్ అధ్యక్షుడు గోదా పాండుయాదవ్, మాజీ అధ్యక్షుడు అడికే జనార్దన్, బుచ్చిరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా మొక్కల పంపిణీ

శంషాబాద్ రూరల్: జాబ్ కార్డులు ఉన్న రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్వేత తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్న వారు మొక్కలను పొలాల్లో నాటుకోవాలన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగు కోసం రైతులకు రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 80 నుంచి వంద శాతం వరకు రాయితీ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు హమీదుల్లానగర్, మల్కారంలోని రైతు వేదికల్లో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు వివరాలు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త కనెక్షన్ల మంజూరు, ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు పంచవటి ఫీడర్. 10 నుంచి 10.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 3 నుంచి 13 వరకు. సాయిగౌతం కాలనీ, సాయి చంద్ర కాలనీ, గ్రీన్ స్పేస్, అలకాపూర్ సెక్టార్-2, గోల్డెన్ టెంపుల్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 11 నుంచి 11.30 వరకు లక్ష్మీనగర్ ఫీడర్, తుల్జారాం ఫీడర్, శివాజీనగర్ ఫీడర్, మణికొండ ఫీడర్, జనచైతన్య ఫీడర్. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు బీఆర్‌సీ ఫీడర్, పుప్పాలగూడ ఫీడర్, ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్లలో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల వరకు అలకాపూర్ ఫీడర్ పరిధిలోని రోడ్డు నెంబర్ 13 నుంచి 22 వరకు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీజీ కాలేజ్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో సరఫరా ఉండదని తెలపారు.

నార్సింగి ఏఈ పరిధిలో..

నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధికి సరఫరా ఇచ్చే నార్సింగి-1, మార్కెట్ యార్డ్, ఇబ్రహింబాగ్, సీబీఐటీ, కోకాపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్ ల్యాండ్, జైహింద్ లేఅవుట్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 10.30 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు అల్లు స్టూడియో, 7హిల్స్, వెస్ట్రన్ టవర్స్, శ్రీకృష్ణ గోశాల ప్రాంతాలు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు వీరభద్ర ఫీడర్, శ్రీనగర్ ఫీడర్, అలిజాపూర్ ఫీడర్, వాసవి ఫీడర్, గండిపేట ఫీడర్, కోకాపేట ఫీడర్, 3.30 నుంచి 4గంటల వరకు పీజీ కాలేజ్ ఫీడర్‌ల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ తెలిపారు.

శివరాంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎన్‌పీపీ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, ప్రభుత్వ పాఠశాల ప్రాంతం, హసన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని హసన్‌నగర్, శివరాంపల్లి, ఎన్టీఆర్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని బాబానగర్, హసన్‌నగర్, ఫహాడి, ఎన్టీనగర్, అక్బర్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి: మరమ్మతుల కారణంగా కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందనిఅధికారులు తెలిపారు. దుర్గానగర్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 10.30 వరకు దుర్గానగర్, దుర్గా హిల్స్, టీఎస్‌జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం, మైలార్‌దేవ్‌పల్లి కల్లు కాంపౌండ్, శాంతినగర్, గణేష్‌నగర్ స్వప్న థియేటర్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.